
ప్రజల మాట ప్రగతి బాట

పాలేరు నియోజకవర్గం



## నేటితో ముగియనున్న ఎన్నికల ప్రచారం

### 48 గంటల పాటు మద్యం దుకాణాలు బంద్

ఖమ్మం, నవంబర్ 27: శాసనసభ ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరుకున్నది. మరో 48 గంటల్లో పోలింగ్ ప్రారంభమవుతుంది. నేటి సాయంత్రం 5 గంటలతో ప్రచారానికి తెరపడనున్నది. జిల్లాలో 5 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నువ్వా.. నేనా అన్నట్లుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సభలు నిర్వహించారు. ఒకరిపై మరొకరు విమర్శానాస్త్రాలను ప్రయోగించారు. ఈ ప్రచార పర్వంలో భాగంగా జిల్లాలో వివిధ పార్టీల అగ్రనాయకులు పర్యటించారు. బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆ పార్టీ అభ్యర్థుల తరుపున జిల్లాలో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాల ప్రజలతో సభలు నిర్వహించి ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మరోవైపు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ, పలువురు కేంద్ర మంత్రులు, సీపీఎం, సీపీఐ రాష్ట్ర, జాతీయ నాయకులు, వివిధ పార్టీల రాష్ట్ర, కేంద్ర నాయకులు జిల్లాలో వారి అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీన జరగబోయే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ జరిగే 30వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను బంద్ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మరోవైపు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలి : కలెక్టర్

ఖమ్మం రూరల్, నవంబర్ 27: ఎన్నికల విధుల సిబ్బంది ప్రతిఒక్కరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి సోమవారం పాలేరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్ జారీ, ఇప్పటి వరకు జరిగిన ఓటింగ్, ఇంక ఎంతమంది వేయాల్సి ఉన్నది.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు కేంద్రంలో ఉన్నది లేనిది అడిగి తెలుసుకొని, వారికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గూర్చి వివరించారు. కౌంటర్లు పెంచి త్వరితగతిన ఓటింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలేరు రిటర్నింగ్ అధికారి ఎం రాజేశ్వరీ, సహాయ రిటర్నింగ్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రిటికల్ పోలింగ్ కేంద్రాల సందర్శన

ఖమ్మం, నవంబర్ 27: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి సోమవారం నగరంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, చేపట్టిన మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మొమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హార్వెస్ట్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ సిబ్బంది, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సెక్టార్ అధికారులు, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పార్టీలు సహకరించాలి

### కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్

ఖమ్మం, నవంబర్ 27: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి, జిల్లా ఎన్నికల అధికారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30న జరిగే పోలింగ్‌కు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 97.5శాతం ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేసినట్లు, 27వేల ఓటర్ సమాచార స్లిప్పులు సంబంధిత ఓటర్లు అందుబాటులో లేక పంపిణీ కాలేదని, వాటిని రిటర్నింగ్ అధికారులకు తిరిగి ఇచ్చినట్లు తెలిపారు. ఓటర్ సమాచార స్లిప్పు కేవలం సమాచారం కొరకు మాత్రమేనని, ఓటు వివరాలు ఆన్‌లైన్‌లో, సంబంధిత బీఎల్‌వో ద్వారా తెలుసుకోవచ్చని, లేకున్నా ఓటు వేయవచ్చని, గుర్తింపు కార్డులు వెంట తీసుకొని, సంబంధిత పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చని ఆయన అన్నారు. జిల్లాలో 2,35,315 కొత్త ఎపిక్ కార్డులు సంబంధిత ఓటర్లకు అందజేసినట్లు, ఓటరు నమోదు చివరి రెండు రోజుల్లో దరఖాస్తు చేసిన 9,900 మందికి ఎపిక్ కార్డులు సోమవారం అందినట్లు, వీటిని త్వరగా బట్వాడా కొరకు ఎన్నికల సంఘం బీఎల్‌వోల ద్వారా చేయాలని అనుమతి ఇచ్చిందని, మంగళవారంలోగా రాజకీయ పార్టీల వారికి సమాచారం ఇచ్చి పంపిణీ పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు తమ పోలింగ్ ఏజెంట్ల జాబితా ఇవ్వాలన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు, మంగళవారం సాయంత్రం నాటికి ఇతర జిల్లాలకు చెందిన వారు వెళ్లిపోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. డ్రై డే సందర్భంగా మంగళవారం సాయంత్రం అన్ని వైన్ షాపులు మూసివేస్తారన్నారు. బయటి వ్యక్తులు జిల్లాలో ఉండడానికి వీలులేదన్నారు. 29 లోగా వాహనాల పాసులు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని ఆయన తెలిపారు. కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, జి. కృష్ణ, సత్యం బాబు, జి. విద్యాసాగర్, కె.కరుణాకర్, కృష్ణ ప్రసాద్, తిరుమలరావు, నున్నా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ జోరు.. ప్రచార హోరు



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే కందాళ



ఇంటింటి ప్రచారంలో కందాళ విజయమ్మ



పిండిప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

ఖమ్మం రూరల్, నవంబర్ 27: గ్రామగ్రామాన బీఆర్ఎస్ జోరు కొనసాగుతున్నది. కందాళ గెలుపు కోసం మేము సైతం అంటూ వివిధ గ్రామాల నుంచి పలు కుటుంబాలు, నాయకులు, కార్యకర్తలు రోజూ బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో సోమవారం తిరుమయలపాలెం మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని సాయిగణేష్‌నగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన యువకులకు ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ద్వారానే యువకులకు సరైన న్యాయం జరుగుతుందని, చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా హైదరాబాద్‌లో భారీ ఐటీ సెక్టార్ విస్తరింపజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ప్రజలను మరింత చైతన్యం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కూసుమంచి, నవంబర్ 27: కూసుమంచి మండల కేంద్రంలో ఇంటింటికీ బీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి విజయమ్మ, కూతుర్లు దీపిక, దీప్తి, బంధువులు సోమవారం ప్రచారం సాగించారు. సంత కావడంతో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, నవంబర్ 27: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని పిండిప్రోలు, కేశ్వాపురం, తెట్టెలపాడులో ముమ్మరంగా



కేశ్వాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రచారం చేశారు. ప్రతి ఓటరుకు ప్రభుత్వ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు చామకూరి రాజు, పరికపల్లి చంద్రశేఖర్, జక్కుల వీరన్న, చిర్ర కృష్ణయ్య, బిల్లగిరి దనుంజయ, గుంటి పుల్లయ్య పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్

ఖమ్మం, నవంబర్ 27: జిల్లాలో శాసనసభ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 72 గంటల ముందు కీలకమని గుర్తించిన ఎన్నికల సంఘం పలు మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఈ నెల 30వ తేదీన పోలింగ్ జరుగనున్న నేపథ్యంలోఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఈ నెల 29వ తేదీన ఉదయం వారికి కేటాయించిన నియోజకవర్గాల్లోని రిసెప్షన్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లోకి విధులకు తరలిస్తారన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఈ నెల 29వ తేదీలోగా సిబ్బంది ఓటు వేసే





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్

అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొద్దిమంది ఉద్యోగులు శిక్షణ కేంద్రాల్లో వేశారన్నారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు నిఘా పటిష్టం చేస్తున్నామన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని 1456 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 822 లోకేషన్లు ఉండగా 390 పోలింగ్ స్టేషన్లు క్రిటికల్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు. పోలింగ్ స్టేషన్ లోకేషన్ బయట ప్రాంతంలో 526 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. 212 మంది మైక్రో అబ్జర్వర్లు క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షణ చేస్తారన్నారు. జిల్లాలో 1456 పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల లోపల సెల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. 100 మీటర్ల వెలువలనే పార్టీ శ్రేణులు ప్రచారం చేసుకునే అవకాశం ఉందన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నదని, ఎన్నికల సంఘం నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలుంటాయని పేర్కొన్నారు.

# ఆరనీకుమా ఈ దీపం.. కార్తీక దీపం

### కిటకిటలాడిన శివాలయాలు

### కార్తీక పౌర్ణమి కావడంతో భక్తుల రద్దీ

కూసుమంచి, నవంబర్ 27: కూసుమంచిలోని కాకతీయుల నాటి శివాలయంలో వేలాది మంది భక్తులు కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పౌర్ణమి ఉండడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో 10 గంటల వరకు ఆలయం వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. చైర్మన్ కొక్కిరేణి వీరస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణ కర్త సాధు వీరప్రతాపరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ, కూతురు దీపిక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజారి దేవులపల్లి శేషగిరిశర్మ, ఈవో శ్రీకాంత్, విజయలక్ష్మి కమిటీ సభ్యులు, సత్యనారాయణ, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రంగబాలాజీ పాల్గొన్నారు.



కూసుమంచి శివాలయంలో భక్తుల రద్దీ

**తిరుమలాయపాలెంలో..**

తిరుమలాయపాలెం, నవంబర్ 27: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రజలు జరుపుకున్నారు. మండలంలోని పిండిప్రోలు, బీరోలు, కాకరవాయి, సుబ్లేడు, రఘునాథపాలెం తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రజలు పూజలు చేశారు.







తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు శివాలయంలో.., కూసుమంచి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, భక్తుల రద్దీ